నిరుపయోగంగా బస్ షెల్టర్లు

- ప్రయాణికులకు అవస్థలు
- ఏలూరు నగరంలోని దుస్థితి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో వివిధ ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థలు గతంలో నిర్మించిన బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. కొత్త బస్టాండును ఆనుకుని ఒక సినీ హీరో ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు బస్ షెల్టర్, ఆర్టీసీ డిపో గ్యారేజ్ ప్రాంతంలో ఒక క్లబ్ ప్రతినిధులు బస్ షెల్టర్ నిర్మించారు. బస్ బస్టాండును ఆనుకుని నిర్మించిన షెల్టర్‌ను వివిధ కారణాలతో గతంలోనే తొలగించారు. క్లబ్ ప్రతినిధులు నిర్మించిన బస్ షెల్టర్ వద్ద ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి లేక పోవడంతో భిక్షకులకు, మందుబాబులకు అడ్డాగా మారింది. టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న మరో బస్ షెల్టర్‌లో భిక్షాటన చేసే వారు రాత్రి సమయాల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. వీటితో పాటు పాత బస్టాండు వద్ద ఉన్న ఆటో, జీపు స్టాండు వద్ద ఒక బస్ షెల్టర్ ఆటో డ్రైవర్లకు నీడనివ్వడానికి, వారు అష్టాచమ్మ వంటివి ఆడుకోవడానికి, వసంతమహల్ వద్ద ఉన్న బస్ షెల్టర్ పురోహితులు సేద తీరడానికి ఉపయోగపడుతున్నాయి. జూట్ మిల్లు వద్ద మరో బస్ షెల్టర్ వీధి వ్యాపారులకు అడ్డాగా మారింది.

అవసరం లేని చోట షెల్టర్లు

ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి ప్రతి రోజూ కనీసం వెయ్యి మందికి పైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి బస్సుల కోసం వేచి ఉంటుంటారు. జిల్లా కేంద్రం కావడంతో పోలీస్, విద్యాశాఖ, న్యాయ స్థానాలు, సర్వజన ఆసుపత్రికి ఇలా వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారు పని ముగిసిన తర్వాత గమ్యస్థానాలకు వెళ్లేందుకు బస్సుల కోసం ఈ ప్రాంతంలోనే వేచి చూస్తుంటారు. తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, ద్వారకా తిరుమల, నరసాపురం, పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, కై కలూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడ నుంచే బస్సులు ఎక్కుతుంటారు. వారికి నిలువ నీడ లేదు. ఈ ప్రాంతంలో 15 సంవత్సరాల క్రితం ఒక పెద్ద మర్రి చెట్టు ప్రయాణికులకు నీడనిచ్చేది. దీనిని రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. ఫలితంగా ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. చింతలపూడి, సత్తుపల్లి, వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు స్థానిక అమీనాపేట ప్రాంతంలో వేచి ఉంటారు. అక్కడ ఎక్కువ మంది ప్రయాణికులు చింతలపూడి, ఏలూరు మధ్యలోని వివిధ గ్రామాలకు వెళ్లేందుకు వేచి ఉంటారు. ఈ ప్రాంతంలో ఉన్న బస్ షెల్టర్ సరిపోవడం లేదు.



ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద షెల్టర్ లేక ఎండలోనే వేచి ఉన్న ప్రయాణికులు



టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

ఎండకు ఎండి, వానకు తడిచి

ప్రయాణికులు ఎక్కువ మంది వేచి ఉండే ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేకపోవడం, ఉన్నా చాలక పోవడం వంటి కారణాలతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాల్లోనే బస్సులు నిలుపుదల చేసి ఉన్న బస్ షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

షెల్టర్లను నిర్మించాలి



ఏలూరు నగరంలో గతంలో దాతలు, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్మించిన బస్ షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఉన్నవి నిరుపయోగంగా తయారవ్వగా, అవసరమైన చోట బస్ షెల్టర్లు లేకపోవడం విడ్డూరంగా ఉంది. పాలకులు ప్రయాణికుల అవసరాల మేరకు ఆయా ప్రాంతాల్లో బస్ షెల్టర్లను నిర్మించాలి.

– బి.నాగరాజు, బాప్టిస్ట్‌పేట, ఏలూరు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

నగరంలో పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఉన్న పలు బస్ షెల్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రయాణికుల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. బిక్షాటన చేసేవారు, డ్రైవర్లు, కూర్చుని కాలక్షేపం కబుర్లు చెప్పుకునేవారికి ఆవాసాలుగా మారాయి. నిర్వహణ గాలికి వదిలేశారు.

– గారపాటి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేత, ఏలూరు

క్లుప్తంగా

అర్జీలపై విచారణ పూర్తిచేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్‌రాజు

దెందులూరు: అన్ని గ్రామాల్లో పీజీఆర్ఎస్ దరఖాస్తులపై విచారణ త్వరగా పూర్తి చేయాలని ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.వి జయకుమార్ రాజు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. అర్జీలపై గ్రామాల వారీగా సమీక్ష చేశారు. డిప్యూటీ తహసీల్దార్ నాగమణి, ప్రియదర్శిని, ఆర్ఐ అజయ్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

8 నుంచి ఆధార్ క్యాంపులు



బాలసరస్వతి

ఏలూరు (టూటౌన్): పోస్టల్ శాఖ ఏలూరు డివిజన్ సూపరింటెండెంట్‌గా జీవీ బాల సరస్వతి సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు ఏలూరులో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. ఐదు నుంచి ఏడేళ్ల పిల్లలకు మొదటి బయోమెట్రిక్ అప్డేట్, 15 నుంచి 17 ఏళ్ల వయసు గల వారికి మొదటి లేదా రెండో బయోమెట్రిక్ అప్డేట్ సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. ఇతర సేవలను రూ.75, రూ.125 రుసుముతో అందిస్తామని తెలిపారు. ఈ క్యాంపులు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో ఏలూరులోని కస్తూరిబా గవర్నమెంట్ స్కూల్, కోటదిబ్బ, 10, 11 తేదీల్లో గవర్నమెంట్ హై స్కూల్, రామకోటి వద్ద క్యాంపులు నిర్వహిస్తామన్నారు. 13, 14 తేదీల్లో విద్యా వికాస్ స్కూల్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద జంగారెడ్డిగూడెంలో క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సేవలు ఉపయోగించుకోవాలని బాలసరస్వతి కోరారు.

గ్రామాభివృద్ధికి దాతల చేయూత అభినందనీయం

దెందులూరు: గ్రామాభివృద్ధికి దాతల చేయూత అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పోతునూరు గ్రామంలో సోమవారం కొమ్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ పీపీ వీరమాచినేని ప్రభాకర్ అధ్యక్షతన దాత కొమ్మారెడ్డి రాంబాబు రూ.30 లక్షలతో నిర్మించిన వైద్యశాల భవనం, రూ.2 లక్షలతో నిర్మించిన తాగునీటి ప్లాంట్, రూ.10 లక్షలతో నిర్మించిన విద్యార్థుల సైకిల్ షెడ్డును స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, దాత కొమ్మారెడ్డి రాంబాబు ఆయన కుమారుడు కొమ్మారెడ్డి సదాశివరావు సిద్దు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సోమవారం ప్రారంభోత్సవం చేశారు.

శరీర రుగ్మతల సమూహం సెరిబ్రల్ పాల్సీ



సెరిబ్రల్ పాల్సీ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): సెరిబ్రలీ పాల్సీ అనేది శరీర రుగ్మతల సమూహమని డాక్టర్ కె.నిర్మల అన్నారు. ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ దినోత్సవం సందర్భంగా స్థానిక టైటస్ నగర్‌లోని పీహెచ్‌సీలో సోమవారం అవగాహన సదస్సు డాక్టర్ నిర్మల సెరిబ్రల్ పాల్సీ గురించి వివరించారు. సెరెబ్రల్ అంటే మెదడుకు సంబంధించిందని, పాల్సీ అంటే కదలికలలోని సమస్యలు లేదా బలహీనత అని, చిన్నతనంలో వచ్చే కదలిక వైకల్యాల్లో అత్యంత సాధారణమైందని తెలిపారు. ఇది మెదడు అభివృద్ధిలో లోపం లేదా అభివృద్ధి చెందుతున్న మెదడుకు జరిగిన నష్టం కారణంగా సంభవించే శాశ్వతమైన రుగ్మతల సమూహం అన్నారు. ఈ రుగ్మతలు ప్రధానంగా వ్యక్తి శరీర కదలికలు, భంగిమ, కండరాల నియంత్రణను ప్రభావితం చేస్తుందని తెలిపారు. సంస్థ కో–ఆర్డినేటర్ డి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీకి పూర్తి నివారణ లేనప్పటికీ, సరైన చికిత్స, నిర్వహణ ద్వారా వ్యక్తి సామర్థ్యాలు, జీవన నాణ్యతను మెరుగుపరచవచ్చని, వాటిలో ఫిజియోథెరపీ (పీటీ) కండరాల బలం, సమతుల్యత, నడకను మెరుగుపరచడానికి సహాయపడుతుందని వివరించారు. పీహెచ్‌సీ సిబ్బంది, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది అవగాహన పెంపొందించారు.

8న మున్సిపల్ ఆఫీసు వద్ద ధర్నా



కార్మికులతో మాట్లాడుతున్న సోమయ్య

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఆప్కాస్ కార్మికుల రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్ అయిన, చనిపోయిన ఆప్కాస్ కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 8వ తేదీన మున్సిపల్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్నట్టు ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కార్మికుల వయస్సు పెంచకపోవడం అన్యాయమన్నారు. చనిపోయిన లేదా రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ చెల్లించడం లేదని, దీంతో వారి వారసులకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు గతంలో సమ్మె చేయగా, ఈ నేపథ్యంలో చేసుకున్న ఒప్పందానికి అనుగుణంగా జీఓలు ఇవ్వడం లేదని సోమయ్య విమర్శించారు. ధర్నాలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. ఈ ప్రచారంలో భాగంగా స్థానిక 10, 11 సర్కిళ్లలో ఆయన 8వ తేదీ ధర్నాను విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు లావేటి కృష్ణారావు నరమామిడి నాగమణి, ఎ.ఏసురత్నం, మేతర పాప, మరియమ్మ, మీనా కుమార్, లీలా కృష్ణ, నాగమణి, దేవీ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

నిడమర్రు: పత్తేపురంలో నివాస స్థలాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని పలువురు సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ దుర్గాప్రసాద్‌కు విన్నవించారు. సోమవారం నిడమర్రులో నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక వద్ద అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ గవర సత్యనారాయణ మాట్లాడారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

జంగారెడ్డిగూడెం: స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెంలోని యూటీఎఫ్ కార్యాలయం హాలులో ఏపీ రైతు సంఘం మండల మహాసభ ఆ సంఘం మండల అధ్యక్షుడు బోడిక రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహా సభలో రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేశారని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ పసల సూర్యారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ గ్రామ స్థాయి వరకు రైతు సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు.

నిరీక్షణ.. ప్రదక్షిణ!

- నూతన పింఛన్ల కోసం అర్హుల ఎదురుచూపులు
- 15 నెలలుగా ఓపెన్ అవ్వని ఆన్‌లైన్ సైట్
- సచివాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

దెందులూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వితంతు, వృద్ధాప్య పింఛన్ల కోసం నూతనంగా దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు నిత్యం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ ఇంకా సైట్ ఓపెన్ అవ్వలేదని అధికారులు చెబుతుండడంతో నిరాశగా వెనుదిరిగుతున్నారు. గ్రామాల్లో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే పింఛన్లే ప్రధాన ఆధారం. గత ప్రభుత్వం ప్రతి నెలా రూ.3 వేల పింఛన్‌ను అందజేసేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత పింఛన్ నగదును రూ.4 వేలకు పెంచింది. కానీ అదనంగా నూతన పింఛన్లు మంజూరు చేయక పోవడంతో అర్హులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే లబ్ధిదారులను ఎంపిక చేసి కొత్తగా అర్హులైన వారికి పింఛన్లు అందజేసేవారు. మొదటి మూడు సంవత్సరాల పాటు ప్రతి మూడు నెలలకో సారి చొప్పున నూతన పింఛన్లు అందజేసేది. ఆ తరువాత 2023, 2024 సంవత్సరాల్లో ప్రతి ఆరు నెలలకు అర్హులైన వారు నష్టపోకుండా వలంటీర్ల ద్వారా ఎంపిక చేసి పింఛన్లు అందజేసింది. 2024 జనవరిలో వైఎస్సార్ సీపీ హయాంలో చివరిగా నూతన పింఛన్లు అందజేశారు. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో నూతన పింఛన్లకు బ్రేక్ పడింది. ఆ విధంగా 2024 ఏప్రిల్‌లో ఆగిపోయిన సైట్ నేటికీ ప్రారంభం కాలేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబర్‌లో కొత్త జీవో తీసుకొచ్చింది. పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే, మరుసటి నెల నుంచి భార్యకు పింఛన్ అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏడాదిగా నూతన పింఛన్లు రాకపోవడంతో దెందులూరు మండలంలో 60 సంవత్సరాలు నిండిన సుమారు 1500 మందికి పైగా లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. 2024 డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి సంక్రాంతికి జన్మభూమి కార్యక్రమం నిర్వహించి నూతన పింఛన్లు అందజేస్తామని గత డిసెంబర్‌లో ప్రజా ప్రతినిధులు ప్రకటనలు చేశారు. దీంతో సంక్రాంతికి నూతన పింఛన్లు అందుతాయని ఎదురు చూసిన లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి.



దెందులూరు సచివాలయం

50 ఏళ్ల హామీ అమలు ఎప్పుడో?

ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే వెనుబడిన తరగతులకు చెందిన వారికి 50 సంవత్సరాలు పూర్తయిన వెంటనే పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. దీంతో మండలంలో సుమారు 6 వేల మందికి పైగా 50 సంవత్సరాలు నిండిన వారు ప్రభుత్వ హామీ ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

అర్హులకు అందజేయాలి



అర్హులందరికీ ప్రభుత్వం నూతన పింఛన్లు అందజేయాలి. వృద్ధులు, వితంతువులకు ప్రభుత్వం అందజేసే పింఛనే ఆధారం.కనీసం ఆరునెలలకు ఒక్కసారైనా నూతన పింఛన్లు అందజేయాలి.అర్హులైన లబ్ధిదారులను గుర్తించితక్షణమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ముంగర సంజీవ్‌కుమార్, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్

దరఖాస్తులు స్వీకరించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయినా నేటికీ నూతన పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరించకపోవడం దారుణం అర్హులైన లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 50 ఏళ్లకు పింఛన్ అందజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది.

– అప్పన ప్రసాద్, దెందులూరు మాజీ ఏఎంసీ చైర్మన్

50 ఏళ్లకు పింఛన్ అందజేయాలి



కూటమి ప్రభుత్వంలోచేతి వృత్తుల వారికి ఎటువంటి పథకాలు అందడం లేదు. ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా వెనుకబడిన తరగతుల వారికి 50 ఏళ్లకు పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు చెందిన 50 ఏళ్లు నిండిన వారికి వెంటనే పింఛన్లు అందజేయాలి.

– నిట్టా లీలా నవకాంతం, దెందులూరు జెడ్పీటీసీ

ఆదేశాలు వస్తే అందజేస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం పింఛను అందుకుంటున్న భర్త చనిపోయిన భార్యలకు నూతన పింఛన్లు అందజేస్తున్నారు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పింఛన్లు అందజేస్తాం.

– రాధాకృష్ణ, పింఛన్ల ఇన్‌చార్జి, ఎంపీడీఓ కార్యాలయం, దెందులూరు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	52	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	32
బెండకాయలు	20	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	54	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	70–90
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	46	గోంగూర	07–10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	13
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	02
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	0
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	70
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీస్



యువకుడ్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏలూరుకు చెందిన ఒక యువకుడిని త్రీటౌన్ పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారు. ఆ యువకుడ్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు బీడీ కాలనీకి చెందిన షేక్ ఉమర్ ఫారూఖ్ అనే యువకుడు స్థానికంగా ఒక ప్రైవేటు కంపెనీలో బాయ్ పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతనికి వివాహమైంది. ఇటీవల ఉమర్ ఫారూఖ్ అతని భార్యకు మధ్య చిన్నపాటి మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. భార్య తన తల్లి ఇంటికి వెళ్లటంతో ఒంటరిగా తీవ్ర మానసిక వత్తిడికి లోనయ్యాడు. జీవితంపై విరక్తితో ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు. ఏలూరు జూట్‌మిల్లు సమీపంలోని రైలుపట్టాలపైకి వెళ్ళి ఆత్మహత్యాయత్నం చేయబోగా, 112 కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారంతో త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నరేంద్ర ఘటనా స్థలానికి చేరుకుని ఫారూఖ్‌ను రక్షించారు. అతడ్ని త్రీటౌన్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. క్షణికావేశంలో ఏలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని, కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని, జీవితంలో సమస్యలు, కష్టాలు సహజమేననీ వాటిని తట్టుకుంటేనే విజయం సాధిస్తామని నచ్చజెప్పారు. బాధితుడిని తన తండ్రి కరీముల్లాకు అప్పగించారు. ఆయన త్రీటౌన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జేఏసీ నాయకుల ర్యాలీ

జంగారెడ్డిగూడెం: పాలస్తీనాలోని గాజా ప్రజలకు మద్దతుగా ఈ నెల 7వ తేదీ సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తామని, ఈ ర్యాలీకి అన్ని పార్టీలు, ముస్లిం సోదరులు హాజరు కావాలని జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ పిలుపునిచ్చింది. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి 7వ తేదీకి రెండు సంవత్సరాలు కావస్తోందని, 70 వేలకు పైగా ప్రజలు మృత్యువాతకు గురయ్యారన్నారు. గాజా ప్రజలకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ షేక్ ముస్తఫా, షేక్ బాజీ (టిప్ టాప్), షేక్ యాకూబ్, షేక్ ఆదిల్, షేక్ అక్బర్, షేక్ నజీర్, అబ్దుల్ షాహి, షేక్ ముస్తాక్, సయ్యద్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలకు డిమాండ్



డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): గత ఐదు దశాబ్దాలుగా జంగారెడ్డిగూడెం మండలం కేతవరం సీలింగ్ భూమి పట్టాదారులుగా ఉన్న దళిత పేదలను ఆ భూముల్లో వెళ్లకుండా అడ్డుకుంటున్న జంగారెడ్డిగూడెం తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీ దేవిని కోరారు. సోమవారం బీకేఎంయూ, సీపీఐ నాయకులు కేతవరం భూ సమస్యపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఏలూరులో కలిశారు. 1975లో ల్యాండ్ సీలింగ్‌లో 67 ఎకరాల భూమిని 66 మంది పేద దళితులకు ప్రభుత్వం పట్టాలిచ్చిందని పేర్కొన్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో భూములు కోల్పోయిన భూస్వామి బినామీ కౌలుదారులను సృష్టించి అసైన్డ్ పట్టాదారులపై ఎల్ఆర్ ఏటీ కోర్టులో దావా వేయగా కోర్టు ఆసైన్డ్ లబ్ధిదారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. తర్వాత భూస్వామి హైకోర్టులో అప్పీల్ చేయగా మూడో పార్టీగా అసైన్డ్ లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. కొద్ది రోజుల్లోనే హైకోర్టులో కూడా తీర్పురానున్నట్టు వెంకటేశ్వరరావు వివరించారు. ప్రభుత్వ పట్టాలు పొందిన లబ్ధిదారులు భూముల్లోకి వెళ్లి సాగు చేస్తుంటే తహసీల్దార్ పోలీసులను పంపి ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ పేదలు వ్యతిరేకంగా ప్రవర్తించడం సరికాదనా అన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలిసిన వారిలో బీకేఎంయూ జిల్లా సహాయ కార్యదర్శి గోలిమే బాలయేసు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జీవీ రమణ రాజు, కేతవరం దళితులు మంచాల ప్రభాకర్, ముప్పిడి రత్తయ్య, తాళ్లూరి నాగరాజు తదితరులు ఉన్నారు.